ఏడ్చి ఏడ్చి... జనం పల్చబడ్డ సమయాన రాజుగాడ్ని గోనెసంచిలో గబాల్న చుట్టి రైలుకట్ట కింద సారాయి కొట్టు దగ్గర దించాడు.

"ఒరే నా కొడకా... ఈ రోజు అచ్చం సచ్చినోడి లెక్కనే యాక్షన్ చేసినవ్‌రా... నీయమ్మ... ఇరవై రెండ్రూపాయల సిల్లర పడింది. ఇంద... రెండు రూపాయలు నువ్వుంచుకో..." అన్నాడు జోగులు.

"లేదన్నా... వొళ్లంతా నెప్పులు పెట్టింది. కదలక, మెదలక అన్ని గంటలు ఎండలో పండుకుంటే రెండు రూపాయలేనా... ఐదివ్వు" అన్నాడు రాజుగాడు ఎఱ్ఱరంగు తుడుచుకుంటూ...

"యెల్లెహె... ఎదవ సచ్చినోడ... ఈ నాల్గు వుంచేసుకో" అని కొంత చిల్లర రాజుగాడి చిట్టి చేతుల్లోకుక్కి తను కల్లు దుకాణంలో చొరబడ్డాడు జోగులు. పీకల్దాకా తాగి... తూలుతూ పాటలు పాడుతూ రైలు పట్టాల మధ్యనించి నడుస్తున్నాడు. నడిచి, నడిచి జేబులోంచి మరో రెండు గుడుంబా పాకెట్లు తీసి పళ్లతో చించి గటగటా తాగేసాడు.

ఒళ్లు తూలింది. అడుగు పడలేదు. మత్తుగా పట్టాలమీదే పడిపోయాడు.

రెడ్‌లైట్ వెలుగుతూనే వుంది. దడ్ దడ్ దడ్ దడ్...

పట్టాల వెంట ఇనుప చక్రాల ప్రకంపనాల ప్రవాహం !

5.00 గంటలు : సాయంత్రం

అక్కడ కన్నెప్పుల్ని తొల్చుకుంటూ పాడుకున్నోడికి సర్‌గమ్..

పర్సులున్నోడికి స్వర్గం.

నగరం నాగరికత బుగ్గమీద పచ్చబొట్టు పొడిపించుకుంటే, అది ఎంగిలి మెరుగుల రాచపుండై... సంస్కృతిని తొలిచే గొంగళి పురుగుల

